సాక్షి సిద్దిపేట

శనివారం : 29 : జూలై : 2023



అప్రమత్తతతోనే ఆరోగ్య రక్ష

వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నుంచి బయట పడతారని వైద్యులు సూచిస్తున్నారు. 8లో..



కల్తీ కల్లేనా?

దుబ్బాకలో పలువురు అస్వస్థతకు గురైన ఘటనకు కల్తీ కల్లునా? కలుషిత నీరు కారణమా..? అని నిర్ధారించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. 8లో..



వరదలకు తీవ్ర నష్టం

హుస్నాబాద్‌రూరల్: నియోజకవర్గంలో కురిసిన వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎల్లమ్మ చెరువు, పందిల్ల బ్రిడ్జి వద్ద కోతకు గురైన కరకట్టలను ఆయన పరిశీలించారు.

న్యూస్‌రీల్

తూము పనులు పూర్తి చేయండి



అసంపూర్తి పనులను చూపుతున్న రైతులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండల పరిధిలోని అయినాపూర్ గ్రామ పెద్ద చెరువు తూము పనులు త్వరగా పూర్తి చేయాలని మత్స్యకారుల సంఘం జిల్లా కన్వీనర్ తేలు ఇస్తారి డిమాండ్ చేశారు. శుక్రవారం తూమును పరిశీలించి మాట్లాడారు. పనులు సకాలంలో పూర్తి చేయక సుమారు 70ఎకరాల్లో నాటు వేసిన వరి పొలాలు ఇసుక కప్పుకు పోయాయన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సుమారు రూ.60 కోట్లతో చేపడుతున్న చెరువు మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతులు చీకోటి నర్సింహులు, యాదవరెడ్డి, బాలచందర్, రాజు, శీను, శంకర్, నరేష్, శివ రాములు పాల్గొన్నారు.

మెలకువలు పాటించాలి

జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

మిరుదొడ్డి(దుబ్బాక): ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో దెబ్బ తిన్న పంటలపై రైతులు మెలకువలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ కోరారు. మండల పరిధిలోని అందె గ్రామంలో వానలకు పాడైన పత్తి, మొక్కజొన్న పంటలను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మిరుదొడ్డి రైతు వేదిక భవన్‌లో ఆయిల్ పామ్, పంటల వివరాల నమోదు, రైతు బీమా పథకాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాలతో దెబ్బ తిన్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు తగిన సలహాలు సూచనలు ఇవ్వాలని ఏఈ, ఏఈఓలకు సూచించారు. గత నెల 20వ తేదీలోపు పట్టా పాస్ బుక్కులు పొందిన రైతులు వచ్చేనెల 5వ తేదీలోగా రైతుబీమాకు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో దుబ్బాక, మిరుదొడ్డి మండలాల వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన ట్రస్మా సభ్యులు



జిల్లా విద్యాధికారిని సన్మానిస్తున్న ట్రస్మా సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా ట్రస్మా నూతన కార్యవర్గం (కందాల పాపిరెడ్డి వర్గం) డీఈఓ శ్రీనివాస్‌రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా విద్యారంగానికి సంబంధించిన సమాచారం ఇవ్వాలని ట్రస్మా సభ్యులు కోరారు. దీనికి డీఈఓ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డి, కార్యదర్శి భాస్కర్, హరినాథ్, ఉపాధ్యక్షులు సంతోష్, సలహాదారు శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీ వివరాలు తెలపండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా దేశంలో ప్రతీ సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని బీజేపీ హామీ ఇచ్చిందని, ఇప్పటి వరకు భర్తీ చేసిన వివరాలు తెలపాలని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి గద్దెనెక్కిన కేంద్రంలోని బీజేపీ మాట తప్పిందన్నారు. పార్లమెంట్‌లో ఈ విషయం స్వయంగా ఒప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో పయ్యావుల శ్యామ్, ఇరుగంటి రమేశ్, దాసరి రమేశ్, రాగారం రాములు, సాయిచరణ్ గౌడ్ పాల్గొన్నారు.

నిబంధనల కొర్రీలు

- పనితీరు ప్రాతిపదికన మార్కుల కేటాయింపు
- అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ
- అర్హత పొందుతామో లేదోనని ఆందోళన

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం సవాలక్ష ఆంక్షలు విధించింది. సర్కార్ నిబంధనలకు జేపీఎస్‌ల్లో గుబులు మొదలైంది. పనితీరు ప్రాతిపదికన కేటాయించే మార్కులు పొంది రెగ్యులరైజేషన్‌కు అర్హత సాధిస్తామో లేదోనని అయోమయానికి గురవుతున్నారు.

జేపీఎస్‌లకు క్రమబద్ధీకరణ ఆంక్షల గుబులు



నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, కమిటీ సభ్యులు

సాక్షి, సిద్దిపేట: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్)కు క్రమబద్ధీకరణ గుబులు పట్టుకుంది. పనితీరే ప్రామాణికంగా నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన వారికి రెగ్యులరైజేషన్‌కు అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అదే విధంగా గ్రామపంచాయతీల నిర్వహణ, పాలన, ఇతర అంశాల ఆధారంగా మార్కులు కేటాయించి పనితీరు మదింపు చేయాలని నిర్ణయించింది. అయితే నిర్ణీత మార్కులు రాకుంటే క్రమబద్ధీకరిస్తారో? లేదో? అని జేపీఎస్‌లు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 317మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు క్రమబద్ధీకరణ చేయాలని ఇటీవల సమ్మె చేపట్టారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చి రెగ్యులరైజేషన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన వారు 176 మంది

జిల్లాలో 2019 ఏప్రిల్ 12 నుంచి వివిధ బ్యాచ్‌ల వారీగా జేపీఎస్‌లను ప్రభుత్వం విధుల్లోకి తీసుకుంది. జిల్లాలో 317 మందిని విధుల్లోకి తీసుకోగా, అందులో 40 మంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో చేరారు. 277 మంది జేపీఎస్‌లలో నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన వారు 176 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరి పనితీరు ఆధారంగా క్రమబద్ధీకరించేందుకు అడిషనల్ కలెక్టర్ నేతృత్వంలో కమిటీని జిల్లా కలెక్టర్ నియమించారు. ఈ కమిటీలో అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, డీఎఫ్ఓ శ్రీనివాస్, ఏసీపీ సురేందర్‌రెడ్డి ఉన్నారు. జేపీఎస్ విధులు నిర్వర్తిస్తున్న గ్రామ పంచాయతీలకు వెళ్లి పరిశీలిస్తున్నారు. మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నారు. వారికి వచ్చిన మార్కులను కలెక్టర్ క్రోడీకరించి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్‌కు పంపించనున్నారు.

అయోమయంలో జేపీఎస్‌లు

గ్రామాల్లో పల్లె ప్రగతి పై మార్కులను కేటాయించనున్నారు. అలాగే కరెంట్ బిల్లు, ట్రాక్టర్ ఈఎంఐలు వంటివి చేర్చడంపై జేపీఎస్‌లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్‌ల అనుమతితో తాము వీటిని చెల్లించాల్సి ఉంటుందని, బిల్లులు రాక వారు చెల్లింపులు చేయకపోతే తమను బాధ్యులు చేస్తే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు కరోనా బారిన, మరికొందరు అనారోగ్యం బారిన పడి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులకు హాజరు కాలేదు. వీరికి ఎలాంటి సెలవులు లేకపోవడంతో క్రమబద్ధీకరణకు అర్హత కోల్పోతున్నారు. కొద్దిరోజుల సర్వీసు లేకపోవడంతో మరికొందరు రెగ్యులరైజేషన్‌కు దూరమవుతున్నారు. జిల్లాలో 15 మందికి పైగా జేపీఎస్‌లు డిప్యూటేషన్ పై ఇతర పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి ఎక్కడి గ్రామ పంచాయతీ పరిగణనలోకి తీసుకుని మార్కులు వేస్తారోనని ఆందోళన చెందుతున్నారు.

పనితీరుపై తనిఖీలు

బెజ్జంకి(సిద్దిపేట): గ్రామాల్లో జేపీఎస్‌ల పనితీరుపై జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం మండల పరిధిలోని గాగిల్లపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఆమె పర్యటించారు. నర్సరీ, హరితహారం, డంపింగ్ యార్డ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదేవిధంగా పంచాయతీల్లో రికార్డులను తనిఖీ చేశారు. ఎంపీఓ విష్ణువర్ధన్, ఎంపీపీ నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, సీఈఓ రమేష్, డీపీఓ దేవకీ దేవి పాల్గొన్నారు.

నిబంధనలు సరికాదు



జేపీఎస్‌లందరినీ క్రమబద్ధీకరించాలి. పల్లెప్రగతి కోసం ఎంతో కష్టపడిన జేపీఎస్‌ల క్రమ బద్ధీకరణకు నిబంధనలు పెట్టడం సరికాదు. మూడేళ్ల సర్వీసు పూర్తయిన వారిని కూడా రెగ్యులరైజేషన్ చేయాలి. గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్‌గా వచ్చేందుకు మా వంతు కృషి చేశాం.

– నాగరాజు, జేపీఎస్‌ల జిల్లా అధ్యక్షుడు

మార్కులు ఇలా..

గ్రామాల్లో వ్యర్థాల వినియోగం, ఎరువుల తయారీకి 10 మార్కులు, పంచాయతీ రికార్డుల నిర్వహణకు మూడు, రోడ్లు, మురుగుకాల్వలు, ప్రభుత్వ కార్యాలయాల పరిశుభ్రతకు 5 మార్కులు, దోమల నివారణకు రెండు, వైకుంఠ ధామం నిర్వహణకు మూడు, క్రీడా ప్రాంగణం నిర్వహణకు 2, వందశాతం ఇంటి పన్ను వసూలుకు 10, ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణకు 15, పదిశాతం హరిత బడ్జెట్ వినియోగానికి 10 మార్కులు, మొక్కల సంరక్షణకు మరో 10, నర్సరీ నిర్వహణకు 10, విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐ చెల్లింపునకు 10, జనన మరణాల రిజిస్టర్ల నిర్వహణకు 5 మార్కుల చొప్పున కమిటీ కేటాయించనున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

శాంతి స్థాపనే లక్ష్యం కావాలి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

గజ్వేల్: శాంతిస్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ పిలుపునిచ్చారు. గజ్వేల్‌లో ఇటీవల చోటు చేసుకున్న ఉద్రిక్తత ఘటనల నేపథ్యంలో శుక్రవారం స్థానిక 'గడా' కార్యాలయంలో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరై కలెక్టర్ మాట్లాడారు. కులం, మతం, జాతి అనే విభేదాలు లేకుండా అందరూ కలిసిమెలిసి జీవించాలన్నారు. సమస్యల పరిష్కారానికి పెద్దలు చొరవ చూపాలని కోరారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయొద్దని సూచించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత మాట్లాడుతూ గజ్వేల్‌లో ఉద్రిక్తత సంఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, ఏసీపీ రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎంపీపీ అమరావతి, జడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్, గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత కొరవడితే వేటు

వేలూరు మురుగు కాలువ పనులపై డిప్యూటీ ఈఈ సీరియస్

సాక్షి స్పందన

వర్గల్(గజ్వేల్): మండల పరిధిలోని వేలూరులో మురుగు కాలువ సైడ్ వాల్ కూలడంతో 'నిర్మించిన మూడు రోజులకే..' శీర్షికన గురువారం 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం డిప్యూటీ ఈఈ ప్రభాకర్ సీరియస్ అయ్యారు. రూ.10 లక్షల గడా నిధులతో గ్రామ ప్రధాన రహదారి పక్కన ఉన్న మురుగు కాలువలో నాణ్యత లేకుండా గోడలు నిర్మించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత కొరవడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మురుగు కాలువను పునర్ నిర్మించనున్నట్లు ఆయన 'సాక్షి'కి తెలిపారు. ఈ మేరకు కూలిపోయిన మురుగు కాలువ గోడలను శుక్రవారం తొలగించారు.



మురుగు కాలువలో కూలిన గోడలను తొలగించిన దృశ్యం

డీజిల్‌లో నీళ్లు కలిశాయంటూ ఆందోళన

చేర్యాల(సిద్దిపేట): తాము కొనుగోలు చేసిన డీజిల్‌లో నీళ్లు కలిశాయంటూ పలువురు వాహనదారులు పట్టణంలోని ఓ పెట్రోల్‌బంక్ ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. మండల పరిధిలోని వీరన్నపేట గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు ఆంజనేయులు, బాబురావు, మరికొందరు బంక్‌లో డీజిల్ కొనుగోలు చేశారు. దానిని వాహనాల్లో పోసి నడపగా అవి మొరాయించాయి. డీజిల్‌ను పరిశీలించగా నీళ్లు కలిసినట్లు గుర్తించిన రైతులు పెట్రోల్ బంక్ యజమానిని నిలదీశారు. విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేయడంతో బంక్ ఎదుట ఆందోళనకు దిగారు. అక్కడికి చేరుకున్న పోలీసులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్ఐ రాజేందర్‌రెడ్డి శాంపిల్ సేకరించేందుకు యత్నించగా నిర్వాహకులు బంక్‌కు తాళం వేసి వెళ్లిపోయారు. దీంతో డీఎస్ఓకు సమాచారం అందించి రైతు వద్ద రెవెన్యూ అధికారులు శాంపిల్ సేకరించారు.



రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

కొత్త జీపీల ఏర్పాటుకు ప్రతిపాదనలు



బంగారులొద్దితండాను నూతన జీపీగా మార్చాలని ఆందోళన చేస్తున్న తండావాసులు (ఫైల్)

కలెక్టర్‌కు సమర్పించిన నివేదిక

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలో కొత్తగా ఐదు గ్రామపంచాయతీల ఏర్పాటుకు వాటి భౌగోళిక, రవాణా దూరం తదితర పూర్తి వివరాలతో శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ జీవన్ పాటిల్‌కు అధికారులు నివేదికను సమర్పించినట్లు తెలిసింది. అక్కన్నపేట గ్రామ పరిధిలోని చౌడుతండా, కుందనవానిపల్లి గ్రామ పరిధిలోని చౌటకుంట తండా, దుబ్బతండా గ్రామ పరిధిలోని దాస్‌తండా, రామవరం గ్రామ పరిధిలో బంగారులొద్దితండా (సేవాలాల్‌తండా), ముంపు గుడాటిపల్లి గ్రామ పరిధిలోని కెప్టెన్ కాలనీలు మొత్తం ఐదు నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు కానున్నట్లు సమాచారం. అయితే ఇటీవల అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి, బొడిగెపల్లి, గోవర్ధనగిరి, మల్‌చెర్వు తండా, రేగొండ, జనగామ, గుబ్బడి, కేశవాపూర్, మంచినీళ్లబండ, గుడాటిపల్లి గ్రామాలు హుస్నాబాద్ మండలంలో విలీనం కానున్నట్లు ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జీపీలుగా ఏర్పాటు చేసేందుకు అర్హత ఉన్న పల్లెలు, తండాల పేర్లను రెవెన్యూ, మండల ప్రజాపరిషత్ అధికారులు నివేదించినట్లు తెలిసింది.

శాంతించిన వరుణుడు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాను వణికించిన వరుణుడు శుక్రవారం కాస్త శాంతించాడు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు మోస్తరు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 8.32సెం.మీ., సగటున 3.02సెం.మీ. వర్షపాతం నమోదైంది. సిద్దిపేటరూరల్ మండలంలో 7.46సెం.మీ., నారాయణరావుపేట మండలంలో 7.31సెం.మీ., చిన్నకోడూరు మండలంలో 5.31సెం.మీ., అక్బర్‌పేటభూంపల్లి మండలంలో 5.23సెం.మీ., సిద్దిపేట అర్బన్ మండలంలో 4.84సెం.మీ., కోహెడ మండలంలో 4.35సెం.మీ. వర్షపాతం నమోదు అయ్యింది.

వచ్చే ఎన్నికల్లోపు సీపీఎస్‌ను రద్దు చేయాలి



గజ్వేల్‌లో ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి అభివాదం చేస్తున్న స్థితప్రజ్ఞ

- టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ
- గజ్వేల్‌కు చేరుకున్న పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర

గజ్వేల్: వచ్చే ఎన్నికల్లోపు ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే దిశగా సీఎం కేసీఆర్ చర్యలు చేపట్టాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ(తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్) రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో చేపట్టిన సంకల్ప రథయాత్ర శుక్రవారం గజ్వేల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఇందిరా పార్కు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరాపార్కు చౌరస్తా వద్ద నిర్వహించిన రోడ్‌షోలో స్థితప్రజ్ఞ మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి రాష్ట్రంలోని 3.35లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షను కేసీఆర్ నెరవేర్చాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్య తీవ్రతను చాటేందుకు 33 జిల్లాల్లో రథయాత్రను పూర్తి చేసుకొని ఆగస్టు 12న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సీపీఎస్‌ను అంతం చేసేవరకు పోరాటం ఆగదని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్, కూరాకుల శ్రీనివాస్, శశిధరశర్మ, వలిఅహ్మద్, సత్యనారాయణ, వేమారెడ్డి, పాపిరెడ్డి, నాగభూషణం, నర్సింలు పాల్గొన్నారు.

సవాలక్ష చిక్కులు

- ఆబాది భూమిలో ఇళ్ల నంబర్లు కష్టమే
- తండాలు, పల్లెవాసులకు తప్పని తిప్పలు
- పాత పద్ధతిని పునరుద్ధరిస్తే పేదలకు న్యాయం

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి రిజిస్ట్రేషన్ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అయితే పల్లె ప్రజలకు భూమి పత్రాలపై అవగాహన లేక, వాళ్ల దగ్గర ఉన్న సాదాబైనామా పత్రాలతో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకున్నా నంబరు కోసం అవస్థలు పడాల్సి వస్తుంది. గత ఏప్రిల్ వరకు అనుమతి లేని ఇళ్ల(బ్యాక్‌లాగ్)కు పంచాయతీ అధికారులు ఫీజు తీసుకుని ఆన్‌లైన్‌లో నంబర్లు కేటాయించేవారు. ఈ ఆప్షన్‌ను మే నెల నుంచి ఆన్‌లైన్‌లో తొలగించారు. దీంతో సొంత స్థలంలో ఇల్లు నిర్మాణం చేసుకున్నప్పటికీ నంబరు కోసం ప్రజలు అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. పాత పద్ధతినే పునఃరుద్ధరిస్తే పేదలకు ఆర్థికభారం తప్పుతుందని ఇంటి నిర్మాణదారులు అభిప్రాయపడుతున్నారు.

పంచాయతీ ఆదాయానికి గండి

గతంలో ఇంటి నిర్మాణం, నంబరు అనుమతుల కోసం ఫీజుతోపాటు పన్నుల వసూళ్ల రూపంలో పంచాయతీలకు ఆదాయం సమకూరేది. ఈ ఆదాయంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు, కార్మికులకు వేతనాలు, వీధి దీపాలు, మురికి కాల్వల నిర్వహణ పనులు చేపట్టేవారు. ఆన్‌లైన్ నుంచి బ్యాక్‌లాగ్ ఇళ్లకు నంబర్లు ఇచ్చే అవకాశాన్ని తొలగించడంతో పంచాయతీల ఆదాయానికి గండి పడింది.



భల్లునాయక్ తండా

''ఒక తండ్రి నుంచి ఇద్దరు కొడుకులకు ఇల్లు వస్తే దాని పక్కనే ఖాళీ స్థలంలో చిన్న కొడుకు కొత్తగా ఇల్లు నిర్మించుకున్నాడు. దానికి నంబరు ఇవ్వాలంటే రిజిస్ట్రేషన్ పత్రాలను అడిగారు. చేసేదేమీ లేక వంద గజాల స్థలానికి రూ.20వేల ఫీజు చెల్లించి నోటరీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి వచ్చింది. గ్రామాల్లో ఒక ఇంటికి రూ.3వేలు చెల్లిస్తే అధికారులు అనుమతులు ఇచ్చేవారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాల కోసం రూ.30 వేల వరకు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.''

అనుమతులు ఇవ్వాలి

గిరిజన తండాలు, శివారు పల్లెల్లో సొంత జాగలో ఇంటి నిర్మాణం చేసుకున్న వారికి నంబర్లు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. నంబరు లేనివారు బ్యాంకులు రుణం పొందలేకపోతున్నారు. ఇళ్ల నిర్మాణానికి ఇటు ప్రభుత్వం సాయం అందించకపోగా నంబరు ఇవ్వడానికి సవాలక్ష కొర్రీలు పెట్టడంపై పల్లెవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదల సమస్యలను దృష్టిలో పెట్టుకొని బ్యాక్ లాగ్ ఇళ్లకు నంబర్లు ఇచ్చి క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

ఇంటి నంబరు ఇవ్వడం లేదు



అక్కన్నపేట మండలం పెద్దతండాలో మా తాతలు సాదాబైనామా ద్వారా భూమి కొనుగోలు చేసి ఇల్లు కట్టారు. అందులో నా వంతుకు గుంట భూమి వస్తే ఇల్లు కట్టుకున్న. అయితే ఆ ఇంటికి గ్రామ పంచాయతీ అధికారులు నంబరు ఇవ్వడం లేదు. మా జాగలో ఇల్లు కట్టుకున్నా ఇలా ఇబ్బంది పెడితే ఎలా. అధికారులు ఆలోచించి బ్యాక్‌లాగ్ ఇళ్లకు అనుమతులు ఇవ్వాలి.

– భాస్కర్‌నాయక్, గిరిజన నాయకుడు

ఇప్పుడు అవకాశం లేదు



ఈ పంచాయతీలు వచ్చినప్పటి నుంచి బ్యాక్ లాగ్ ఇళ్లకు ఇంటి నంబర్లు ఇచ్చినం. ఇప్పుడు ఆ అవకాశం లేదు. ప్రభుత్వం మళ్లీ ఆన్‌లైన్‌లో మార్పిడికి, కొత్త నంబర్లకు అనుమతి ఇస్తే ఇల్లు కట్టుకున్నవారికి అందరికీ నంబర్లు ఇస్తాం.

– సత్యనారాయణ, ఎంపీఓ, హుస్నాబాద్

క్లుప్తంగా

మద్యంమత్తులో ఉరేసుకున్నాడు


నర్సింలు మృతదేహం

కొండాపూర్(సంగారెడ్డి): తాగిన మైకంలో ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలపరిధిలోని అనంతసాగర్‌లో శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. కొండాపూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. అనంతసాగర్‌కు చెందిన బంగారి నర్సింలు (59) పారిశుధ్య కార్మికుడిగా పని చేసేవాడు. కొన్ని రోజులుగా పూర్తిగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం మధ్యాహ్నం మద్యం తాగొచ్చి ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య బంగారి జయమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న ఇద్దరు..

చికిత్సపొందుతూ ఇద్దరు చనిపోయారు. సంగారెడ్డిలో అపస్మారక స్థితిలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తి, మద్దూరులో శ్లాబ్ పై నుంచి పడి గాయపడిన మరో వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందారు.

మద్దూరు(హుస్నాబాద్): చికిత్స పొందుతూ వ్యక్తి శుక్రవారం మృతిచెందారు. దూళ్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లికి చెందిన నందన బోయిన శ్రీహరి(40) వ్యవసాయ కూలీగా పనిసేవాడు. ఈనెల 15న ఇంటి శ్లాబ్‌పై నుంచి ప్రమాదశాస్తు పడి గాయపడ్డాడు. వెంటనే కుటుంబీకులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతను చికిత్సపొందుతూ శుక్రవారం మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సోదరుడు నందనబోయిన యాదగిరి ఫిర్యాదు మేరకు ఎస్సై నారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి..


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కంది(సంగారెడ్డి): చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. రూరల్ ఎస్‌ఐ రాజేష్ నాయక్ కథనం ప్రకారం.. ఈనెల 24న కంది పరిధిలో జాతీయ రహదారి పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆపస్మారక స్థితిలో ఉండగా 108లో సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ గుర్తుతెలి యని వ్యక్తి ఈనెల 27న మరణించాడు. కంది పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌గౌడ్ ఫి ర్యా దు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి చూసే బీఆర్‌ఎస్ పార్టీలోకి..

- ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్‌ఎస్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ప్రతిపక్షాల కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లోకి చేరుతున్నారని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడప గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్నివర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

సంగారెడ్డి టౌన్: వీధి కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. శుక్రవారం పట్టణంలోని బాలాజీనగర్లోని తన ఇంటి నుంచి బాలుడు బయటికి వెళ్తుండగా కుక్కల సమూహం దాడి చేసింది. ఈ దాడిలో చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. ఇది గమనించిన ఓ మహిళ వెంటనే వాటిని తరమడంతో సురక్షితంగా బయటపడ్డాడు.

అప్రమత్తతతోనే ఆరోగ్య రక్ష



- సీజనల్ వ్యాధులతో ప్రజలు జరభద్రం
- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. డెంగీ, మెదడువాపు, మలేరియా జ్వరం, బోదకాలు వంటి వ్యాధుల నియంత్రణ కోసం దోమతెర, జాలీలు వాడాల్సి ఉంటుంది. ఇళ్ల పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధుల నుంచి బయట పడతారని వైద్యులు సూచిస్తున్నారు. దీనిపై కథనం..

హత్నూర(సంగారెడ్డి): కూలెక్స్ దోమ వల్ల మెదడు వాపు వ్యాధి వస్తోంది. దోమ కుట్టిన పది రోజులలోపు లక్షణాలు బయటపడతాయి. ముఖ్యంగా 1 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకు వచ్చే అవకాశముంది. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అసాధారణంగా కళ్లు తిరుగుతాయి. పక్షవాతానికి గురయ్యే ప్రమాదముంది. వాంతులు, విరేచనాలు అవుతాయి. కొన్నిసార్లు ఫిట్స్ కూడా రావచ్చు.

జాగ్రత్తలిలా..
దోమ తెర వాడాలి. ఇళ్లల్లోకి రాకుండా కిటికీలు, తలుపులు, సన్నటి జాలీలు బిగించుకోవాలి. జనావాస మధ్యన పందులు సంచరించకుండా చూసుకోవాలి. మురుగు గుంతలు, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వకుండా చూడాలి. నిల్వ ఉంటే కిరోసిన్, ఇంజిన్ ఆయిల్ పోయాలి. సెప్టిక్ ట్యాంక్ గొట్టాలకు దోమ తెర, గుడ్డ లాంటివి ఏర్పాటు చేసుకోవాలి. పిల్లలకు జ్వరం వస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించాలి.

డెంగీ లక్షణాలు

ఏడిస్ ఈజిప్టి వైరస్ దోమ వల్ల ఒకరి నుంచి మరొకరికి డెంగీ వైరస్ వ్యాప్తి చెందుతోంది. దోమ కుట్టిన తర్వాత 5 నుంచి 8 రకాల లక్షణాలు కనిపిస్తాయి. ఉన్నట్టుండి జ్వరం ఎక్కువగా వస్తోంది. తలనొప్పి అధికమవుతోంది. కంటి కదలికల సమయంలో భరించలేని నొప్పి ఉంటోంది. కండరాలు, కీళ్ల నొప్పులతోపాటు వాంతులు అయినట్లుగా ఉంటోంది. నోరు ఎండిపోవడం, అధిక దాహం, ఒళ్లు నొప్పులు, శరీరంపై ఎర్రటి దురదలు, నాడి నెమ్మదిగా కొట్టుకోవడం, రక్తపోటు పడిపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయి.

జాగ్రత్తలు
డెంగీ దోమ పగటి పూట మాత్రమే కుడుతోంది. ఉదయం సమయంలో జాగ్రత్తగా ఉండాలి. పూలకుండీలు, ఎయిర్ కూలర్లు, నీటి నిల్వ తొట్లు, గొట్టాలు, నిల్వ ఉన్న ప్రాంతాల్లో జాగ్రత్త తీసుకోవాలి. సాక్సులు, బూట్లు, శరీరాన్ని పూర్తిగా కప్పి ఉండేలా ప్యాంట్లు, షర్టులు ధరించాలి. పగటి పూట కూడా దోమ తెర వాడాలి.

మలేరియా లక్షణాలు

సాయంత్రం పూట విడవకుండా జ్వరం రావడం, చలి వణుకు ఉంటోంది. ఈ లక్షణాలను బట్టి చికిత్స చేయించాలి. రక్త పరీక్ష చేసిన వెంటనే మలేరియా క్రిములు కనబడవు. శరీరంలోకి ప్రవేశించిన తర్వాత కొద్ది రోజులకు మాత్రమే ఇవి రక్త పరీక్షల్లో బయటపడతాయి. అప్పటి వరకు వేచి చూస్తే మలేరియా మరింత తీవ్రమయ్యే అవకాశముంది. రోగకారణాలు మెదడు మీద ప్రభావం చూపితే సెరిబ్రల్ మలేరియాకు దారితీసే అవకాశముంది. చిన్నారులు సెరిబ్రల్ మలేరియా బారిన పడే అవకాశం ఉంది.

జాగ్రత్తలు
దోమ కాటుకు గురికాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలి. ప్రతి నీటి తొట్టిలూ ప్రతి మూడు రోజులకోసారీ ఖాళీ చేసి మళ్లీ తాజా నీటిని నింపుకోవాలి. ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరిబోండాలు వాడి పడేసిన టైర్లు ఉంచకూడదు. ఇంట్లో కూలర్లలో నీటిని ప్రతి మూడు రోజులకోసారీ మార్చుకోవాలి.

చికెన్ గున్యా లక్షణాలు

చికెన్ గున్యా జ్వరం పగటి పూట కుట్టే పులి దోమ ద్వారా వస్తోంది. తీవ్రమైన జ్వరం, విపరీతమైన కీళ్ల నొప్పులు, వాపులు, నేలపై నుంచి లేచేందుకు వీలులేని విధంగా శరీరమంతా నొప్పులుంటాయి.

జాగ్రత్తలు..
భరించలేని ఒళ్లు, కీళ్ల నొప్పులు, జలుబుతో బాధపడేవారు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఎప్పటికప్పుడూ వాటిని వేడి నీటితో శుభ్రపరచాలి. ఇంటి పరిసరాలు శుభ్రం చేయాలి. దోమతెరలు వాడుతూ, డబ్బాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. నిల్వ ఆహారం తినొద్దు.

బోదకాలు లక్షణాలు

తరచూ కొద్దిపాటి జ్వరం, ఆయాసం బోదకాలు ప్రాథమిక లక్షణాలు. పురుషులలో వరి బీజం ఏర్పడుతోంది. గజ్జల్లో వాపు వస్తోంది. నిర్ధారణకు రాత్రి సమయంలో రక్త నమూనాలు సేకరిస్తారు. బాధితుడు విశ్రాంతి సమయంలో పరాన్న జీవులు రక్త ప్రసరణ వ్యవస్థలోకి ప్రవేశిస్తాయి. 5 నెలల్లో ప్రౌఢ జీవులుగా వృద్ధి చెందుతాయి. ఇలా శరీరంలో 6 ఏళ్ల పాటు జీవించే ఈ పరాన్న జీవులు లక్షల సంఖ్యలో ఉత్పత్తయి శోషణ వ్యవస్థలోకి చేరతాయి. దీంతో శరీర అవయవాలు అసాధారణ వాపునకు గురవుతాయి.

జాగ్రత్తలు...
నివారణకు ప్రధానంగా దోమలను నిర్మూలించాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధి నివారణకు డీఈసీ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. ఈ మాత్రల ద్వారా శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతోంది.

పరిశుభ్రం ముఖ్యం




ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. దోమల నివారణకు కాయిల్స్, లిక్విడ్స్ వేప రేజర్ల కన్నా దోమ తెరలు విని యోగిస్తే ఫలితం ఉంటుంది. ముఖ్యంగా పరిసరాలతోపాటు వ్యక్తిగతంగానూ పరిశుభ్రంగా ఉండాలి. – శంకర్, దౌల్తాబాద్ పీహెచ్‌సీ వైద్యాధికారి

వాగులో కారు గల్లంతు!

నంగునూరు (సిద్దిపేట): సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కేనపల్లి వద్ద వాగు దాటుతున్న క్రమంలో శుక్రవారం రాత్రి కారు గల్లంతవడం కలకలం రేగింది. బస్వాపూర్, అక్కేనపల్లి గ్రామాల మధ్య నిర్మించిన చెక్‌డ్యామ్ రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అక్కేనపల్లి వైపు ప్రవాహం పెరిగి రోడ్డు కోతకు గురికావడంతో వాహనాలు వెళ్లే మార్గం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో రాత్రి కారు వంతెన వైపు వచ్చిందని అక్కేనపల్లి పోయే దారి లేకపోవడం, తిరిగి పోరెడ్డిపల్లి వైపు రాకపోవడంతో కారు గల్లంతైందని ప్రత్యక్ష సాక్షి తెలిపాడు. కారులో ఒకే వ్యక్తి ఉన్నారని తెలిసింది. సిద్దిపేట కమిషనర్ శ్వేత, రూరల్ సీఐ చిరాలు, రాజగోపాల్‌పేట ఎస్‌ఐ రాజుగౌడ్ అక్కేనపల్లి పరీవాహక ప్రాంతంలో గాలిస్తుండగా.. కొహెడ పోలీసులు పోరెడ్డిపల్లి, బస్వాపూర్ పైపు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే.. ఈ ఘటనపై పోలీసులు అధికారులు ఇంకా ధృవీకరించాల్సి ఉంది. కారు గల్లంతు ఘటనపై ప్రత్యక్ష సాక్షులను విచారించామని, సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని సీపీ శ్వేత అన్నారు.

రెండు మూగజీవాల మృత్యువాత

రెండు చోట్ల మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. పిడుగుపాటుతో పాడిగేదె, విద్యుదాఘాతానికి ఎద్దు చనిపోయాయి.


పాడిగేదె కళేబరం

కొమురవెల్లి(సిద్దిపేట): పిడుగుపడి పాడి గేదె మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని రసూలాబాద్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పచ్చిమడ్ల ఐలేనికి చెందిన పాడి గేదె పిడుగుపాటుకు గురైమృతి చెందింది. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.


ఎద్దు కళేబరం

చేర్యాల(సిద్దిపేట): విద్యుత్ షాక్‌తో ఎద్దు మృత్యువాత పడింది. ఈ సంఘటన రాంపూర్‌లో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు శెట్టి బీరయ్య తన ఎద్దును శుక్రవారం ఉదయం మేతకు తీసుకు వెళుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మృత్యువాత పడింది. సుమారు రూ.80వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

ప్రమాదవశాత్తు ముగ్గురు మృతి

ప్రమాదవశాత్తు వేర్వేరు చోట్ల ము గ్గురు మృతిచెందారు. చిన్నకోడూరు మండలంలో సలాక కట్ట మీద పడి ఒకరు, కొండాపూర్ మండలంలో చేపలకు వెళ్లి మరొకరు, చేర్యాలలో విద్యుత్‌షాక్‌తో ఇంకొకరు చనిపోయారు. పోలీసుల, కుటుంబసభ్యుల కథనం ప్రకారం..

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు సలాక కట్టలుపడి కూలీ మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని ఎల్లాయపల్లి శివారులోని మెగా కంపనీ వద్ద శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన కృపా చౌదరి(32) ఎల్లాయపల్లి వద్ద మెగా కంపెనీలో కూలీగా పని చేసేవాడు. కంపెనీ స్టోర్‌కు సలాక లోడ్ లారీ వచ్చింది. మరో ఇద్దరు కూలీలతో జేసీబీతో సలాక కిందికి దింపారు. సలాక పట్టీలు తుప్పు పట్టకుండా కింద ఇనుప పట్టీలు వేసే క్రమంలో ప్రమాదవశాత్తు సలాక కట్ట కృపాచౌదరి తలపై పడింది. ఈ ప్రమాదంలో తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించా రు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు లల్లు యాదవ్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శివానందం కేసు దర్యాప్తు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి.. ప్రమాదవశాత్తు వ్యక్తి ..
కొండాపూర్(సంగారెడ్డి): చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. కొండాపూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని అనంతసాగర్‌కు చెందిన మందుల మల్లేశం (32), అతడి సోదరుడితోపాటు మరికొందరు గ్రామశివారులో గల చౌదరి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు మల్లేశం చెరువులో పడిపోయాడు. అతడి కోసం గురువారం రాత్రి వరకు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మృతదేహం బయటపడింది. మృతుడి సోదరుడు మందుల రాముల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లగ్ పెడుతుండగా


బింగి రమేశ్

చేర్యాల(సిద్దిపేట): ప్లగ్ పెడుతుండగా విద్యుత్ షాక్‌కు గురై మండలంలోని చుంచనకోటకు చెందిన యువకుడు హైదరాబాద్‌లో శుక్రవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బింగి రమేశ్(25) హైదరాబాద్‌లోని మొయినాబాద్ వైన్స్ షాపు వద్ద చుడువా అమ్ముతుండేవాడు. శుక్రవారం ఉదయం రమేశ్ స్విచ్ బోర్డులో ప్లగ్ పెడుతుండగా షాక్ గురై మృతిచెందాడు. మృతుడికి ఇటీవల వివాహమైంది. దీంతో సొంతూరు చుంచనకోటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

లోఓల్టేజీతో దెబ్బతిన్న గృహోపకరణాలు


దెబ్బతిన్న టీవీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): లోఓల్టేజీతో గృహోపకరణాలు దెబ్బతిన్నాయి. ఈ సంఘటన సిద్దిపేటలో చోటుచేసుకుంది. గురువారం రాత్రి, శుక్రవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో 9వ వార్డులో విద్యుత్ సరఫరాలో లోఓల్టేజీ కారణంగా 50 కుటుంబాల్లోని టీవీలు, విద్యుత్ బల్బులు, ఫ్యాన్‌లు, సెల్‌ఫోన్ చార్జర్‌లు, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు దెబ్బతిన్నాయి. ప్రతి ఇంట్లో సుమారుగా రూ.50వేల నుంచి లక్ష వరకు నష్టం వాటిల్లిందని కాలనీవాసులు తెలిపారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్‌ను సంప్రదించగా, గురువారం రాత్రి వర్షం పడటం ద్వారా విద్యుత్ స్తంభాల కింద ఉన్న చెట్లు తగిలి సరఫరాలో హెచ్చుతగ్గులతో దెబ్బతిన్నాయన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదు రాగానే వెంటనే సంఘటనా స్థలానికి సిబ్బందితో కలిసి వెళ్లి సమస్యను పరిష్కరించామన్నారు.

ఇస్లాంపూర్‌లో కార్డన్ సెర్చ్

- 33 బైక్‌లు సీజ్


మాట్లాడుతున్న డీఎస్పీ యాదగిరిరెడ్డి

తూప్రాన్: ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదేశాల మేరకు మండలంలోని ఇస్లంపూర్‌లో సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా తనిఖీలు చేపట్టారు. ధ్రువపత్రాలు లేని 33 బైక్‌లు సీజ్ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులతో డీఎస్పీ యాదగిరిరెడ్డి మాట్లాడారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై వివరించారు. గ్రామ సర్పంచ్ సుకన్య, వార్డు సభ్యులు గ్రామస్తులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కిరాణా డబ్బాలో చోరీ

నర్సాపూర్ రూరల్: కిరాణా డబ్బా వెనుక నుంచి రంధ్రం పెట్టి చోరీ చేశారు. ఈ సంఘటన నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట గేటు వద్ద గురువారం రాత్రి జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద చింతకుంట గేటు వద్ద యజమాని వెంకటయ్య గుడి.. కొన్ని రోజులుగా డబ్బా ఏర్పాటు చేసుకుని కిరాణా వస్తువులు, బిస్కెట్లు విక్రయిస్తున్నాడు. గురువారం రాత్రి 9 గంటలకు తాళం వేసుకొని ఇంటికెళ్లాడు. శుక్రవారం ఉదయం డబ్బా తెరిచి చూడగా వెనుక నుంచి కన్నం వేసి కిరాణా వస్తువులు, సిగరెట్ ప్యాకెట్లు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేశాడు. సుమారుగా 25 వేలపైగా వస్తువులు పోయినట్లు గుర్తించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాంతులు విరేచనాలతో ఒకరు మృతి

- బల్వంతాపూర్‌లో ఇద్దరికి అస్వస్థత
- కల్తీ కల్లు కారణమంటున్న గ్రామస్తులు


కుంటయ్య

దుబ్బాకరూరల్: మండలంలోని పద్మశాలిగడ్డకు చెందిన వ్యక్తి వాంతులు, విరేచనాలకు గురై శుక్రవారం మృతిచెందాడు. కుంటయ్య(65) ఈ నెల 25న పొలం పనులు ముగించుకొస్తూ గ్రామంలోని కల్లు దుకాణంలో కల్లు తాతాగాడు. ఇక వాంతులు విరేచనాలతో బాధ పడుతున్నాడు. గురువారం దుబ్బాకలోని ప్రైవేట్ ఆర్‌ఎంపీ వద్ద చికిత్స తీసుకున్నా తగ్గలేదు. శుక్రవారం తిమ్మాపూర్ వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి కుంటయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో 108 అంబులెన్స్‌లో దుబ్బాకకు తరలించారు. ఆస్పత్రికి చేరేలోపే అతను మృతి చెందాడు. కల్లు తాగడంతోనే వాంతులు విరేచనాలై కుంటయ్య మృతి చెందాడని గ్రామస్తులు ఆరోపించారు. అలాగే బల్వంతాపూర్, పద్మశాలిగడ్డ, దుంపలపల్లి, నర్లెంగడ్డ గ్రామాలకు చెందిన కొందరు అస్వస్థతకు గురై గురువారం ఆస్పత్రిలో చేరారు.

బల్వంతాపూర్‌లో..
బల్వంతాపూర్‌లో ఎండీ చాంద్ పాషాకు, చెప్యాల దుర్గవ్వకు రాత్రి 9.30 గంటల సమయంలో వాంతులు విరేచనాలు కావడంతో 108 అంబులెన్స్‌లో దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కల్తీ కల్లేనా?

- కలుషిత నీరుపైనా అనుమానం?
- మిస్టరీ తేల్చేపనిలో మూడు శాఖల అధికారులు
- తాజాగా వృద్ధుడి మృతి
- దుబ్బాక ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతున్న 61 మంది
- శాంపిల్స్ సేకరణ
- ఐపీఎం రిపోర్టుకు వారం సమయం
- దుబ్బాక ఘటనపై ప్రభుత్వం సీరియస్


దుబ్బాక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

సాక్షి, సిద్దిపేట దుబ్బాక ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. వాంతులు, విరేచనాలు ఏ కారణంతో జరిగాయి? వృద్ధుడు ఎలా మృతిచెందాడు? అనే ప్రశ్నల చిక్కుముడి విప్పడానికి 3 శాఖల అధికారులు రంగంలోకి దించింది. కల్తీ కల్లునా? కలుషిత నీరు తాగి మృతిచెందాడా? పలువురు ఎందుకు అస్వస్థతకు గురయ్యారా? అని నిర్ధారించే పనిలో నిమగ్నమయ్యారు.

దుబ్బాక మండలం దుంపలపల్లి, బల్వంతపూర్, నర్లెంగడ్డ, పద్మశాలి గడ్డ గ్రామాలకు చెందిన వారు కూలీ పనులకు వెళ్లి వస్తున్న క్రమంలో కల్లు తాగారు. గురువారం తెల్లవారుజాము నుంచి వారికి వాంతులు, విరేచనాలై అస్వస్థతకు గురయ్యారు. 33 మందికి పైగా దుబ్బాకలో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో 28 మంది ఇంటి వద్దే మందులు వాడుతున్నారు. శుక్రవారం ఉదయం పద్మశాలి గడ్డకు చెందిన కుంటయ్య (65) మృతిచెందాడు.

భిన్నాభిప్రాయాలు
కల్లు వల్లే వాంతులు, విరేచనాలు అయ్యాయని కొందరు పేర్కొంటుండగా, మరికొందరు కలుషిత నీరే కారణమని కొందరు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. వర్షాలతో కల్లు విక్రయ కేంద్రాలలో అమ్మకాలు లేక నిల్వను విక్రయించడంతోనే అస్వస్థతకు కారణమా? అన్నది తేలాల్సి ఉంది. కల్తీ కల్లుతోనే వాంతులు, విరేచనాలు అయ్యాయని వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు.


నర్లెంగడ్డలో మిషన్ భగీరథ అధికారులు


కల్లు శాంపిల్స్ సేకరిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

శాంపిల్స్ సేకరణ
ఎందువల్ల అస్వస్థతకు గురయ్యారని నిర్ధారించేందుకు ఎక్సైజ్ శాఖ, మిషన్ భగీరథ, వైద్యారోగ్య శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ఎక్సైజ్ అధికారులు దుంపలపల్లి, బల్వంతపూర్, నర్లెంగడ్డలలోని కల్లు విక్రయ కేంద్రాల నుంచి కల్లు శాంపిల్స్ సేకరించారు. మిషన్ భగీరథ అధికారులు ఆయా గ్రామాల్లో సరఫరా అయిన నీటిని శాంపిల్స్ సేకరించారు. వైద్య అధికారులు 10 మంది నుంచి బ్లడ్, స్టూల్, మూత్రం శాంపిల్స్ తీసి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంట్ మెడిసిన్ ల్యాబ్ (ఐపీఎం)కు పంపించారు. కల్తీ కల్లు తాగడంతో వృద్ధుడు మృతిచెందాడా? బాధితులు తాగు నీటితో వాంతులు, విరేచనాలయ్యాయా? అన్నది తేలాలంటే రిపోర్టు రావాల్సిందే.

వాటర్ వల్ల కాదు

గజ్వేల్ నుంచి 450 గ్రామాలకు తాగునీటి సరఫరా చేస్తున్నాం. మధ్యలో ఎక్కడా సైతం లీకేజీలు సైతం లేవు. నీరు కలుషితమయ్యే అవకాశమే లేదు. నీరయితే ఇంట్లో వారందరూ అస్వస్థతకు గురి కావాలి. కేవలం కొందరే అస్వస్థతకు అయ్యారు. గ్రామాల్లో సేకరించిన వాటర్ శాంపిల్స్ రిపోర్ట్ శనివారం రానుంది. – గిరిధర్, ఈఈ, మిషన్ భగీరథ

కల్లు శాంపిల్స్ సేకరించాం

ఆయా గ్రామాల్లో విక్రయిస్తున్న కల్లు శాంపిల్స్ సేకరించాం. కోర్టు ద్వారా నిజామాబాద్‌లోని ఎక్సైజ్ ల్యాబ్‌కు పంపిస్తాం. వారం రోజుల్లో రిపోర్టు రానుంది. – శ్రీనివాస మూర్తి, ఈఎస్